# కొమొగారు

## పూలచంద్ర

జడలు గుంజుకోవడం, అరవడం, జోకులేసుకొని పెంకులు ఎగిరి పోయేట్టు నవ్వడం, గుద్దుకోవడం—ఇవి స్నేహలక్షణా లనుకుంటే— సురూప, ఉత్తరూప ప్రాణస్నేహితురాళ్ళు. కాలేజీ రోజుల నుండీ వాళ్ళిద్దరూ అసలు సూదంటురాళ్ళు. ఒకామె సురూప కాబట్టి రెండో ఆమె ఉత్తరూపగా ప్రచారంలోనికి వచ్చింది కాని, ఆమె అసలు పేరు రూప మాత్రమే.

పేర్లు చూస్తేనే తెలుస్తుంది—సురూపలో మూడింట రెండు వంతులు రూప ఆక్రమిస్తే, రూపను పూర్తిగా తనలోనే ఇముడ్చుకుంది సురూప అని.

ప్రాణ స్నేహితురాళ్ళే అయినా ఆమె పెళ్ళికి ఈమె, ఈమె పెళ్ళికి ఆమె హాజరు కాలేకపోయారు. కారణం మరేమీ కాదు — ఇద్దరికీ ఒకే ముహూర్తంలో వేర్వేరు చోట్ల పెళ్ళి అయింది!

పెళ్ళి అయిన రెండేళ్ళకు ఇప్పుడు సురూప ఇంటికి వచ్చింది ఉత్తరూప ఒక్కతే. రూపశ్రీ గారికి (అంటే రూప భర్తకు) ఆఫీస్ ఇన్స్పెక్షను. రాలేకపోయాడు. 'భర్త కంట్రోల్' వల్ల ఇద్దరికీ ఇంకా పిల్లలు పుట్టలేదు.

స్నేహితురాళ్ళ హడావుడి చూసి, తమది పెంకుటిల్లు కానందుకు సంతోషించాడు పక్క గదిలో రేడియో వినలేకపోతున్న మణ్యం!

భర్తను "మా కొమొ గారు" అని పరిచయం చేయడం సురూప సరదాల్లో ఒకటి. కొమొ అంటే కొనుక్కున్న మొగుడు! భర్త మంచితనం గురించి, తమ ఆదర్శ దాంపత్యం గురించి చెవులు మూసుకున్నా చెప్పడం ఆమె తీరొక సరదా.

అప్పటికే "నీవు చాలా అదృష్టవంతురాలివే!" అని పాతికసార్లు అంది ఉత్తరూప. మరో పాతిక సార్లు అలా అనిపించుకోనిదే వదిలేట్టు లేదు సురూప!

"పాతికవేలు పెట్టి కొనుక్కున్నాను కదా మొగుణ్ణి! అందువల్ల నామాట జవదాటరాదని మొదటి రాత్రే ఆంక్ష పెట్టేశాను. పాపం! ఆయన కూడా చాలా మంచివారు. గీసిన గీత దాటరు!" అంది గొప్పగా.

"అదృష్టవంతురాలివే! మా ఆయనా ఉన్నారు— ఉత్త ధర్మభాజనుడు! ఇరవై వేలు పుచ్చుకున్నా కృతజ్ఞతే లేదు. పైగా నన్నొదిలేసి పాతికవేలిచ్చే ఉద్యోగస్థురాలిని చేసుకుంటానని ఒకటే బెదిరింపు రోజూ!" విటుర్చింది ఉత్తరూప.

ఆ విటూర్పు విని సంతృప్తిగా లోలోనే నవ్వుకుంది సురూప. "ఆయనకు కొమొ అని పేరు పెట్టి అందరికీ చెబుతూ ఉంటాను. ఆయన ఉడుక్కుంటూ ఉంటారు. ఒకసారి హెచ్చరించారు కూడా—అందరితోనూ అలా చెప్పకు, అవమానం— అని. ఆయన మాట వినే దెవరట! అసలు మనం కట్నం ఇవ్వకుండానే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం కదే? కాని, మా అమ్మ పడనివ్వలేదు— కట్నం లేని పెళ్ళి అదేం పెళ్ళి? ఇచ్చుకోలేని దరిద్రులమా?—అని. ఆయన అందం, పెర్సనాలిటీ చూసి నేనూ పట్టుపట్టలేదులే. మావాళ్ళ ఇష్టం అన్నా, వాళ్ళు అసలు పుచ్చుకోవడం ఎందుకు? అందుకని ఇలా సాధించదలుచుకున్నా. ఏమైనా ఒక ఆదర్శానికి కట్టుపడినవాళ్ళం కదా మనం!" భర్తకు వినిపించదు అనుకుందో, వినిపించినా ఫర్వా లేదు అనుకుందో—సురూప గట్టిగానే అంటున్నది.

పక్క గదిలోని మణ్యం భ్రుకుటి ముడిపడింది. ముఖం గాంభీర్యం దాల్చింది.

"అదృష్టవంతురాలివే! మొగుణ్ణి కొంగున ముడేశావు!"

"అబ్బే! అంత పెద్ద కొంగు నాకు లేదే! గీత దాటనివ్వను—అంతే. ఏపని చేయమన్నా చేస్తారు, పాపం!"

"ఏదీ కాఫీ తెప్పించు—చూద్దాం!"

పక్క గదిలోకి వెళ్ళింది సురూప. "మై డియర్ సారూ! ప్లీజు కాఫీ కావాలి. రెండు కప్పుల్లో. బ్రహ్మాండంగా ఉండాలి." చెంప మీద సుతారంగా చిటికె వేసి, సున్నితంగా పెదవులు కలిపి, ఉత్తరూప వద్దకు హడావుడిగా వెళ్ళిపోయింది.

ఐదే నిమిషాల్లో ట్రేలో కాఫీ తెచ్చిన మణ్యాన్ని చూసి స్నేహితురాళ్ళు ముఖాలు చూసుకున్నారు— సురూప సగర్వంగానూ, ఉత్తరూప నమ్మలేనట్టూ!

అదృష్టవంతురాలివే—అని మరో పదిసార్లు పొగిడి ఉత్తరూప వెళ్ళిపోయాక—

"సినిమాకు వెళదాం" అంది సురూప. మణ్యం తల వూపాడు.

హాలు వద్ద రిక్షా దిగాక అలాగే ఉండిపోయాడు.

"టిక్కెట్లు తెండి!"

తెచ్చాడు.

అలవాటు ప్రకారం ఎవరూ లేని ఒక మూల కూర్చున్నారు. సినిమా చూస్తున్నంతసేపూ జోకు లేస్తూ, కామెంట్స్ విసురుతూ, చిలిపి పనులు చేస్తూ ఉంటాడు మణ్యం.

ఆ సినిమాకంటే ఈ సినిమా నచ్చుతుంది సురూపకు!

కాని, ఈ రోజు గంభీరంగా ఉండిపోయాడు మణ్యం. భర్త ప్రవర్తన వింతగా తోచి, సినిమా చూసినట్టే లేదు సురూపకు.

ఇంటికి వచ్చాక తెడ్డించింది. పిలిస్తే కాని, భోజనానికి రాలేదు మణ్యం. కూర్చున్నాడు కాని, ముద్ద కలపలేదు.

"ఏమిటి జపం చేస్తున్నారు?"

"తినమంటావా?"

"ఆహా. వద్దు. ఎగ్జిబిషన్ పెట్టాను. చూపించే దాకా పిలిచాను!" అంది వేళాకోళంగా,

## సముద్రం ముద్ర

హైదరాబాదు నుంచి
ఫోనులో పిలిస్తే
విశాఖపట్నం సముద్రం
పలుకుతుంది
నా కళ్ళు
అక్కడే పారేసి కొచ్చాను
ఇసకలో
పీతలు గీసే గీతలు
సముద్ర ఘోషకు
చిత్ర భాష్యాలు
ఒక కెరటం
మరో కెరటాన్ని తరిమినట్లు
జ్ఞాపకాలు
నిలువునా వెంటాడతాయి
తరతరాల అశాంతిని
ఉప్పుపోసినట్లు
విశాఖపట్నం సముద్రం.

— ఎస్. గోపి

అన్నీ పరిశీలనగా చూసి, లేచి వెళ్ళిపోయాడు మణ్యం!

నిర్ఘాంత పోయింది సురూప. ఏమిటి ఈయన ప్రవర్తన?!

వెళ్ళి బతిమాలి తీసుకు వచ్చింది. సంగతేమిటని అడిగింది.

"నేను కోమె కదా? నీవు చెప్పనిదే ఏపనీ చేయ కూడదని."

"అమ్మయ్యో! ఇదంతా నటనే కదా? హడల గొట్టేశారు." నవ్వింది.

కాని, మణ్యం నవ్వలేదు. గంభీరంగా భోజనం ముగించాడు. రోజూ వంటలను, వండిన కవితా మణిని విమర్శిస్తూ అల్లరి పట్టించేవాడు. ముద్దు తీసుకుని, మెరటి ముద్దు ఆమెకు అందించే వాడు. ఇప్పుడు అవేమీ లేవు.

పడక గదిలో.

పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. ఆమె వచ్చింది. సకిలించింది. ఇకిలించింది. ఎదురుగా చీర మార్చుకుంది. కాని, మణ్యం మట్టి బొమ్మ అయాడు!

"ఏమండీ!" గద్దించింది. తల ఎత్తి విశ్వలంగా చూశాడు.

"ఇలా రండి!" వెళ్ళాడు.

"ఇంకా దగ్గరగా!"

ఇంకా. . ఇంకా. . .ఇంకా దగ్గరగా వెళ్ళాడు, రమ్మన్న కొద్దీ. అంతే! సురూపకు విరాళే మిగిలింది.

కొన్ని పనులు చేస్తేనే బాగుంటాయి. చెప్పి చేయించుకోవడం బాగుండదు గాక బాగుండదు!

చివుక్కున కన్నీళ్ళు వచ్చాయి సురూపకు. గిరుక్కున వెను దిరిగి మంచం మీద కూల బడింది.

మణ్యం అక్కడే నిలబడి పోయాడు. ఐదు, పది, పదిహేను నిమిషాలు! చూసింది. మగమహా రాజు నిలబడలేక బాధపడి పోతున్నాడే అని ఆడ మనసు ఆక్రోశించింది.

"అక్కడ ఉండిపోడం ఎందుకు? ఇలా వచ్చి మంచం మీద అఘోరించండి" అంది.

చేతులు కట్టుకుని మంచం వద్దకు వచ్చాడు. ఆమె పక్కనే పడుకుని చేతులు కట్టు కున్నాడు.

వెన్నెల వృథా అయిపోతున్నది. పరువు గోల పెడుతున్నది. గడియారం హెచ్చరిస్తోంది.


ఆమె నిట్టూర్పులూ, ఎక్కిళ్ళూ, ముక్కు చీదులూ బాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా వినిపిస్తూనే ఉన్నాయి. కాని, అతడు కొబ్బరి కొట్టిన రాయిలా ఉండి పోయాడు.

సజీవ శిల్ప సుందరి మంచం మీద పక్కనే ఉండగా నిర్జీవ శిల్పంలా పడి ఉండడం ఎందరికి సాధ్యం?

మణ్యం ఎంత కటిన చిత్తుడో మొదటి సారిగా తెలిసింది సురూపకు.

పధ్నాలుగవ శతాబ్దపు శిల్పాన్ని ఇప్పుడు చూస్తే దానిలో అందమూ ఉంటుంది. కొంత వికృతమూ ఉంటుంది—పెచ్చులు ఊడడం, గీతలు పడడం లాంటి కాలం తెచ్చిన మార్పుల వల్ల.

ఉదయం నిద్రలేచిన సురూప అలా నిరాసంగా ఉంది.



అప్పటికే మణ్యం లేచి, తన పనులన్నీ ముగించు కున్నాడు.

"ఎవరి పెర్మిషన్ తీసుకుని మీరు ముఖం కడుక్కున్నారు?" ఉక్రోషంగా అడిగింది సురూప.

"ముఖం కడుక్కోవడం స్నానం లాంటివి ప్రాథమిక హక్కులు. రాజ్యాంగం ప్రకారం వాటి మీద ఎవరూ పెత్తనం వహించడానికి వీల్లేదు." అతని స్వరం కర్కశంగా వినిపించింది.

హఠాత్తుగా తను పంపారవావ మడి గుండంలో చిక్కు కున్నట్టు విలవిల లాడిపోయింది సురూప. అతి ప్రయత్నంగా దుఃఖం దిగమింగింది కాని, వంట గదిలోనికి వెళ్ళగానే ఏడ్చేసింది.

సురూప వండే టప్పుడు మణ్యం కూరలు తరిగే వాడు. కబుర్లు చెప్పేవాడు. అల్లరి చేసేవాడు. ఎంతో ఆనందంగా హాయిగా, ఉండేది వండుతూంటే.

ఇప్పు డామె ఏడుస్తూ ఒంటరిగా వంట చేసింది. ఉలుకూ పలుకూ లేకుండా ఇంత మింగి ఆఫీసుకు పోయాడు మణ్యం.

ఆత డటు వెళ్ళగానే ఇటు శాంత వచ్చింది. సురూపను చూసి ఆశ్చర్య పోయింది. "ఒంట్లో బాగు లేదా?" అడిగింది.

"బాగానే ఉన్నా నంటూ కబుర్లు మొదల్పెట్టింది సురూప. ఆ స్వరంలో జీవం లేదు. కళ్ళ

ర్లలో సారం లేదు. అరగంట గడిచినా 'మాకోమె గారి' గురించి ఒక్కముక్కా చెప్పలేదు.

శాంతకు ఏదో 'వాసన' తగిలింది. "మీ కోమె గారు గీత దాటి నట్టున్నారు" అంది. అని నవ్వింది. ఆ నవ్వు శూలంలా దిగబడి పోయింది సురూప హృదయంలో.

చిరాకుగా "గీత దాటడం కాదు.." అంటూ నోరు జారింది.

ఘన విజయం సాధించినట్టు నాలుగు వీధులూ తిరిగి పలబ్లై ఇళ్ళలోనూ—డప్పుకొనిమరీ—చాటించి వచ్చింది శాంత.

ఒక్క లొక్కరే పరామర్శకు రావడం, సాను భూతి లేక పోగా వంకరగా నవ్వడం, నోరగాచూడడం!

"ఈ పెంకి పెళ్ళానికి అంతే కావాలి! అత గాడు విసిగిపోయి సన్యాసుల్లో కలిసి ఉంటాడు. లేదా ఇంకోదాన్ని లేవ దీసుకు పోయి ఉంటాడు" అని సురూపకు వినిపించేట్టు గుసగుస లాడడం. ఆయన వూళ్ళోనే ఉన్నారంటే నమ్మరేం? వీళ్ళనా తను ఇంత కాలమూ ఆప్తులుగా తలపోసినది? వీళ్ళ మనసులు ఇంత సంకుచితమా? అని ఆశ్చర్య పడ్డది సురూప.

తాను ఏనాడూ ఎరుగని ఆనందాలు సురూప అనుభవించేస్తూందని అసూయతో మాడిపోయిన ఆ పలబ్లై అలనా మణులూ ఆరాత్రి సంతృప్తిగా నిద్రపోయారు. ఆ పేటలో నిద్ర పట్టనిది సురూప ఒక్కదానికే.

ఉదయం మణ్యాన్ని చూసిన శాంత—అయితే ఈయన సన్యాసుల్లో కలవలేదా? అని నిరాశ పడింది. అయినా ఇంకో రెండు రోజుల్లో కలవక పోతాడా అని ధైర్యం చెప్పుకుంది.

ఏ క్షణాని కా క్షణం శ్రీవారికి సారీ చెప్పి సంధి చేసుకుందాం అనుకోవడం, మరుక్షణం అభిమానం అడ్డు రావడం—రెండు రోజులు నరకం అనుభ వించింది సురూప.

ఆ తెల్లవారు జామున అతని పక్కం మీద వాలిపోయి చెవిలో 'సారీ' చెప్పేసి హృదయ భారం దింపుకుందామని నిర్ణయానికి వచ్చేసి మంచం ఆ చివర నుండి ఈ చివరకి దొర్లితే ఏముంది? ఖాళీ. ఉలిక్కిపడి లేచింది. వెదికింది. మణ్యం జాడ లేదు.

టేబుల్ మీద ఉత్తరం!

సురూప గుండె ఒక్కక్షణం ఆగిపోయింది. గజ గజ వణికిపోతూ చదివింది. "అర్జెంట్‌గా కాంప్ వెళ్ళవలసి వచ్చింది. మీ అనుజ్ఞ లేకుండా వెళ్ళు తున్నందుకు క్షమించాలి. వారం రోజుల్లో వస్తాను. లేదా. ."

పలబ్లై మంది అలనా మణులూ జోరీగల్లై నారు. ఆ రొద భరిస్తూ వారం రోజులూ ముళ్ళమీద నిప్పుల మధ్య ఎలాగో బ్రతికే ఉంది సురూప— ఏడవ రోజు కోసం ఎదురు చూస్తూ, కళ్ళలో ప్రాణం పెట్టుకుని.

సరిగా ఏడవ రోజున మణ్యం రాలేదు కాని, ఉత్తరం వచ్చింది. "సురూపదేవిగారూ! దీనిలో ఇరవై యారు వేలకు చెక్కు ఉంది. మీ రిచ్చిన కట్న బాపతు పాతిక వేలు. మీ అనుజ్ఞలేకుండా విశాఖపట్నం బదిలీ చేయించు కున్నందుకు అపరాధ రుసుం వేయి రూపాయిలు. కొనుక్కున్న మొగుడు అన్న బంధం నుండి నేను ఈక్షణం నుండి విముక్తుణ్ణి."

నెత్తిమీద పిడుగు పడిందా? భూమికూలి పోయిందా? ఏమీ తెలియలేదు సురూపకు. దిగ్భ్రాంతిగా రెండు క్షణాలుండి పోయింది. తర వాత ఏదో బాహ్య శక్తి నడిపిస్తున్నట్లు ఇంటికి తాళం పెట్టి కట్టు గుడ్డలతో స్టేషన్‌కు పరు గెత్తింది. (సినిమా పద్ధతిలో కాదు! రిక్షాలోనే!)

విశాఖలో దిగుతూనే భర్త పనిచేసే ఆఫీసుకు ఫోన్ చేసింది.

"సుబ్రహ్మణ్యం గారి వేళ ఆఫీసుకు రాలేదు."

"ఆయన ఎక్కడ ఉంటున్నారో చెప్పగలరా?"

"చెప్పగలను!"

ఆయన ఇంట్లో ఉంటారో, ఉండరో? ఉంటే ఏం చెప్పాలి? ఉండకపోతే ఏం చేయాలి? క్షణం ఆలస్యం అయితే పూర్తిగా మునిగిపోయే నౌకను రక్షించడానికి ప్రయత్నించే కాప్టెన్‌లా చకచక ఆలోచిస్తూంది సురూప.

పది. . ఇరవై . . ముప్పై సెకండ్లు గడి చాయి.

ఆటో రిక్షాలో వెళ్ళి డోర్ నంబర్ సరి చూసు కుని కాలింగ్‌బెల్ నొక్కింది. క్షణక్షణమూ ఆమె ఉద్వేగం పెరిగి పోతున్నది. ఇప్పుడేం చేసేటట్లు? ఏం చేసేటట్లు? భగవాన్! కళ్ళు మూసుకుంది.

"ఎవరు కావాలండీ?"

కళ్ళు తెరిచింది. ఎదురుగా. . కోమెగారు! కాదు మణ్యంగారు. కాదు కాదు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరరావు గారు! ముఖం గంభీరంగానే ఉంది. "ఎవరు కావా లండీ?" మళ్ళీ అడిగాడు.

లోనికి రెండడుగులు వేసింది సురూప. ఏం చేయాలి? ఏం చెప్పాలి? ఎలా? ఉద్వేగాన్ని తట్టుకో లేక పోతున్న దామె. కళ్ళు మూసుకుంది. దభీమని నేలకూలింది. స్పృహ తప్పు తున్నట్లుంది. రెండు బలమైన చేతులు తనను లేవనెత్తి మంచం మీద పడుకో బెట్టినట్టు తెలిసింది. అంతే తరవాత ఏమీ తెలియ లేదు.

చాలా సేపటికి—

నీరసంగా కళ్ళు తెరిచింది. అతడు ముంగురులు సవరిస్తూ ఉన్నాడు. ఆందోళనగా కనిపిస్తున్నాడు.

నిజమా? కలా?

ఎవరైనా లాక్కు పోతారేమో అన్నంత భయంగా అతని చేతిని గట్టిగా పట్టుకుంది. అతడు చెయ్యి లాక్కోలేదు.

రెండవచేతిలో చెంపలు నిమురుతూ, "లే రూపీ! స్నానం చెయ్యి. నీవు వస్తావని నాకు తెలుసు. నీకిష్టం అయిన దొండకాయా, కొబ్బరికోరూ వేపుడు చేశాను.కంది పచ్చడి చేశాను. లేత్వరగా!" అన్నాడు.

గొప్పవాళ్లంతా వున్నవాళ్లేమీకాదు. లేని వాళ్లుకూడా గొప్పవాళ్లు కాగలరు!
– అని నిరూపించి నీరాజనాలందుకున్న మేనక విచిత్ర జీవిత రూపకల్పనే–
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి
డైరెక్టుగా మీకు అందిస్తున్న నవల..
నీరాజనం
వెల: రూ.15/-
ఆగస్టు 30 విడుదల
* అన్ని షాపుల్లోనూ దొరుకుతుంది. లేదా ఒకరూపాయి తగ్గించి M.O. చేయండి. ఆరురూపాయికి V.P. పంపుతాము.
క్వాలిటీ పబ్లిషర్స్ రామమందిరంవీధి, విజయవాడ- 520002

ఇంతలేసి కళ్ళు నిండా ఆశ్చర్యం నింపుకొని చూసింది సురూప. "అయితే. . . అయితే..." అంది. ఏదో ప్రశ్న ఆమె గుండెలో కొట్టుమిట్టాడుతూంది. బయటికి రావడం లేదు.

"అయితే గియితే లేదు, అయితాపురం మహారాణీ గారూ! బాత్‌రూంలో గోరువెచ్చని నీళ్ళు సిద్ధం చేసి ఉంచాడు మీ కొమొగారు!"

కొమొ అనవద్దన్నట్లుగా అతని నోరు మూసేసింది సురూప.

రెండు చేతుల్లోనూ ఆమెను ఎత్తుకున్నాడు మణ్యం. "రూపీ! మనం ఇద్దరమే ఉన్నప్పుడు నన్ను కొమొ అని లక్షసార్లు పిలువుము. ఆనందిస్తాను. అవమానించని సహృదయుల వద్ద వెయ్యిసార్లు అను. నవ్వుకుందాము. అంతేకాని, అప్పలమ్మలందరి ముందూ అలా అనకు. వాళ్ళు మొగుళ్ళతో చెబుతారు. ఆ మొగుళ్ళు ఆఫీసులో నన్ను అవమానిస్తూ ఉంటారు. తెలిసిందా?" అన్నాడు ఆర్ద్రంగా.

అయితే, ఆయన క్షమించినట్టేనా? నిజమా?! నమ్మబుద్ధి పుట్టడం లేదు. అతని మెడ చుట్టూ చేతులువేసి హత్తుకు పోయింది.

"బాగా చిక్కిపోయావు. బలం తగ్గింది. బరువూ తగ్గింది" అన్నాడు చెవిలో అల్లరిగా అతని కామె ఒరిజినల్ బలమూ, బరువూ తెలుసు.

ఆమె కళ్ళు మూసుకుంది. హృదయం మధుర రాగాలు తీస్తూంటే దరహాసాలు ముఖంలో విచ్చుకుంటున్నాయి. అతడు అంత త్వరగా సులభంగా క్షమిస్తాడనుకోలే దామె. ఈ క్షణంలో మణ్యం అడగకుండా వరం ఇచ్చిన దేవుడులా కనిపించాడు.

అత డామెను అలా ఎత్తుకునే వెళ్ళి బాత్‌రూంలో దింపి తలుపు మూయబోయాడు. "అయ్యా తమరు బయటికి!" అంటూ తోసేసి స్నానం చేశాకగాని, మార్చుకోవడానికి మరో చీర లేదని జ్ఞాపకం రాలేదు.

లుంగీ, షర్టూ అందించాడు మణ్యం. అవి ధరించి బయటికి వచ్చిన ఆమెను చూసి ఫక్కునవి నవ్వాడు. "మగ్రడెస్‌లో ఆడవాళ్ళు బాగుంటారు సుమా!"

రెండు చేతులతోనూ కళ్ళుమూసుకుం దామె. గుండెలోనిపుట్టెడుదు:ఖమూ చిటికెలోపోయినట్టు హాయిగా ఉంది.

మామూలు అలవాటు ప్రకారం కూర కలిపి మొదటి ముద్ద ఆమెకు అందించాడు.

"నాకు ముద్ద అక్కర్లేదు" అంది గోముగా. ఆమెకు కావలసింది ఇచ్చి ముద్ద అందించాడు.

"అయితే నన్ను క్షమించినట్టేనా? క్షమించాను అంటేగాని, ముద్ద మింగను" అంది గారాలుపోతూ.

"దీనిలో క్షమించడానికి ఏముంది, రూపీ! వక్రభాష్యాలు చేస్తూ ఆఫీసులో అందరూ నన్ను వేళాకోళం పట్టించేవారు. వేళాకోళాన్ని కొంతవరకూ భరించవచ్చు. వాళ్ళు హద్దు దాటేవారు. నీ మీద భలే కోపం వచ్చేది. అలా అనవద్దని నీతో చెబుతున్న కొద్దీ ఎక్కువ చేశావు. నన్ను అవమానించడం నీ ఉద్దేశం కాదని నాకు తెలుసు. కాని, వాళ్ళకు తెలియదు కదా? అక్కడి అమ్మలక్కల మధ్య నీకు తెలియకుండానే పెంకి పెళ్ళాం అని నీ మీద ముద్ర పడింది. ఆఫీసులో—పెళ్ళాన్ని అదుపులో పెట్టలేని వాజమ్మ అని నాకొక ముద్ర పడింది. ఆ పరిసరాల్లోనే ఉంటూ ఆ ముద్రలను చెరుపుకోవడం కష్టం. అందుకని ఇంత నాటకం! నీవు ఆ చెక్కు తీసుకుని బాంక్‌కు వెళ్ళినట్టయితే నా బండారం బయటపడేది. బాంక్‌లో అంత డబ్బు లేదు. ఈ కొత్త పరిసరాల్లో మనం ఏ ముద్రా లేని తెల్ల కాగితాల్లాంటి వాళ్ళం. కొంతకాలం గడిచాక కొత్త ముద్రలు పడతాయి. ఎలాంటి ముద్ర కావాలో నిర్ణయించుకుని ఆ ముద్ర కోసం పాటు పడాలి" తిండి మాని ఉపన్యాసమే ఇచ్చాడు మణ్యం.

ఆమె కళ్ళలో ఆరాధన తళుక్కుమంది. భర్త హృదయ ఘనపరిమాణానికి ( వైశాల్యమా? ) విస్తుపోయింది.

వివాహం అయినా, కాలేజీ వాసన ఇంకా వదలక తానే నోరు పారేసుకుంటూ, అమ్మలక్కలముందు తేలికపడడమే కాకుండా ఆఫీసులో భర్తనుఅవమానం పాలు జేసింది. ఇక నుండి గుట్టూ, మట్టూ నేర్చుకోవాలి. పూర్వంలా ఇక్కడ నోటికి స్వతంత్రం ఇవ్వకూడదు.

"నీకే ముద్ర కావాలి?" కొంటెగా అడిగాడు మణ్యం.

"పతియే ప్రత్యక్ష్య దైవం ముద్ర! నిజంగా మీరు దేవుడు!"

పాత చింతకాయ పచ్చడి తిన్న ముఖం పెట్టాడు మణ్యం.

"నేను దేవుడూ కాదు, దయ్యమూ కాదు. నేను కొమొ!"

"కాదు. . .దేవుడు!"

"కాదు. . .కొమొ!"

"కాదు. . .కాదు. . .కాదు"

"ప్రతిసారీ ఇలా నా మాట కాదంటే. . .నీ మూతి మీద. . ." కోపం నటించబోయాడు.

మూతిమీద ఏం చేసుకుంటారో చేసుకోండి—అన్నట్టు మూతి ముందుకు చూపి, కళ్ళు మూసుకుంది సురూప! ★



బక ధ్యానం

ఫోటో — ఎల్. ఆర్. గ్రోవర్ ( రోహతక్ )